ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 28 జూలై 2024 | 5



శనేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ

కొత్తపేట, జూలై 27: మందపల్లి శనేశ్వర(మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు, తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1,82,840 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.







బడికి పడవపై..

వరద సీజన్లో లంక గ్రామాల విద్యార్థుల సాహసం

పి.గన్నవరం, జూలై 27: గోదావరికి ఎర్రనీరు వచ్చిందంటే చాలు ఆ నాలుగు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. దీంతో ఆయా గ్రామాల విద్యార్థులు బడికి పోవాలంటే ప్రమాదకరంగా పడవలో ప్రయాణం చేయాల్సిందే..పి.గన్నవరం మండలంలోని బూరుగులంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిముడిలంక విద్యార్థులు పడవలపై బడికి వెళ్తున్నారు. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో వారికి పడవ ప్రయాణం తప్పడం లేదు. గంటిపెదపూడి శివారున ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలకు వారు రోజూ ఇలానే వెళ్తారు. లైఫ్ జాకెట్లతో వారు బూరుగులంక నదీపాయను దాటుతున్నారు. అలా వారిని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు రక్షణగా ఉండి అవతలి ఒడ్డుకు తీసుకువెళ్లి అప్పగించి తిరిగి వస్తున్నారు. ఒకవేళ వరద ఉధృతి మరింత పెరిగితే విద్యార్థులు ఏటిగట్టు దిగువన కాజ్‌వేను కూడా పడవలపైనే దాటి బడికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది.

నేడు మంత్రుల బృందం పర్యటన

నిడదవోలు, జూలై 27 : అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించనున్నట్లు తెలిసింది..ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మంత్రుల బృందం ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో నేరుగా మాట్లాడతారు.



లంక గ్రామాలకు బియ్యం తరలింపు



పి.గన్నవరం: బూరుగులంక రేవు వద్ద సాగుతున్న పడవ ప్రయాణం



సఖినేటిపల్లిలో కలెక్టర్ మహేష్‌కుమార్ పర్యటన



ఆత్రేయపురం: వాడపల్లి పుష్కరఘాట్ వద్ద వరద నీరు



పి.గన్నవరం:బూరుగులంక రేవు వద్ద మహిళలు పాట్లు



సఖినేటిపల్లిరేవు టిక్కెట్ కౌంటర్

లంక గ్రామాల్లో టెన్షన్

నిండుగా ప్రవహిస్తున్న నదీపాయలు

వాణిజ్య, ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం

ముంపు భయంతో వణుకుతున్న గ్రామాలు

పి.గన్నవరం, జూలై 27: గోదావరి ఎగువ ప్రాంతం భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గుముఖం పట్టి మళ్లీ పెరగడంతో దిగువన ధవళేశ్వరం వద్ద నిలకడగా సాగిన గోదావరి శనివారం మధ్యాహ్నం నుంచి పెరుగుతోంది. దీంతో సముద్రంలోకి 13 లక్షల క్యూసెక్కులకు పైగా వరదనీటిని విడుదల చేయడంతో స్థానిక నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇప్పటికే బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడి మూడి లంకతో పాటు మానేపల్లి శివారు శివాయిలంక గ్రామస్థులు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వారం రోజులుగా లంక గ్రామాలను చుట్టుముట్టిన గోదారమ్మ ఇప్పటికీ అలానే ఉండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పనులకు, నిత్యావసర సరుకులకు ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన కనకాయలంక, అయోధ్య లంక, పెదమల్లంక, అనగార్లంక తదితర గ్రామాల ప్రజలు నాటు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వరద నీరు లంకలను ముంచెత్తడంతో వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

5,993 కుటుంబాలకు నిత్యావసరాలు

కొత్తపేట డివిజన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలలో 5,993 కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయనున్నట్లు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. పి.గన్నవరం మండలంలో 1383 కుటుంబాలకు, అయినవిల్లి మండలంలో 4500 కుటుంబాలకు పంపిణీ జరుగుతోందన్నారు. పి.గన్నవరం మండలంలో గంటిపెదపూడి, ఉడిమూడి, మానేపల్లి, వాడ్రేవుపల్లి, నాగుల్లంక గ్రామాలకు సంబంధించి వరద ముంపు ప్రాంతాలలో ప్రస్తుతం 25 కేజీల చొప్పును బియ్యం అందిస్తున్నామని ఆదివారం వంటనూనె, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, కందిపప్పు అందిస్తామని చెప్పారు. మండల వ్యాప్తంగా తొమ్మిది పడవలు లంక గ్రామాల్లో సేవలు అందిస్తున్నాయన్నారు. అలాగే శివాయిలంక, చినకందాలపాలెం గ్రామాలకు సంబంధించి 600 మందికి భోజనాలు అందించామని స్పష్టం చేశారు. ఆర్డీవోతో పాటు తహసీల్దార్ ఎస్‌కె హరాస్సేన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి తదితరులు ఉన్నారు.

భయం గుప్పెట్లో

లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన..గోదావరి పెరుగుతుండడంతో వణుకు



అంతర్వేది: టేకిశెట్టిపాలెం వంతెన వద్ద వరదలో రామాలయం



మామిడికుదురు: అప్పనపల్లిలో ఇళ్ల చుట్టూ చేరిన వరదనీరు

దోబూచులాటలో గోదావరి వరద..

తగ్గుతూ..పెరుగుతూ నీటి ప్రవాహం

ముంపులో లంక గ్రామాలు

వరద ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

అమలాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద కోనసీమ ప్రజలతో దోబూచులాడుతోంది. తగ్గుతున్నట్టు భావించిన తరుణంలో వరద ప్రవాహం శనివారం మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఫలితంగా కోనసీమలోని 12 మండలాల పరిధిలో లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో పాటు ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. శనివారం 13.20 లక్షల క్యూసెక్కుల నీటిని బంగాళాఖాతంలోకి వదలడంతో జిల్లాలోని గౌతమీ, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీనికి తోడు శనివారం సాయంత్రం నుంచి వర్షపు జల్లులు కురుస్తుండడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. మహారాష్ట్రతో సహా గోదావరి నదీ పరివాహక రాష్ట్రాల్లో భారీ వర్షాలు తీవ్రంగా కురుస్తున్న దృష్ట్యా రాగల రోజుల్లో వరద తీవ్రత మరింత పెరిగే ప్రమాదం ఉందని జలవనరులశాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ మహేష్‌కుమార్ సఖినేటిపల్లి మండల పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పడవపై వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వరద ముంపునకు గురైన బాధితులకు బియ్యం పంపిణీ చేపట్టారు. కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో వంటనూనె, కందిపప్పు వంటి నిత్యావసర సరుకులను లంక గ్రామాల బాధితులకు పంపిణీ చేస్తున్నారు. మంచినీరు కూడా టిన్నుల ద్వారా అందజేస్తున్నారు. వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాలోని మేజర్, మైనర్ డ్రెయిన్లు, పంటకాల్వలు పొంగి ప్రవహిస్తుండడం వల్ల ఇప్పటికే 35వేల ఎకరాల భూముల్లో ఖరీఫ్ పంటకు నష్టం వాటిల్లింది. ఇక ఉద్యాన, వాణిజ్య పంటలకు నష్టం అపారమే. పశువులు కూడా మేతలేక ఇబ్బందులు పడుతున్నాయి. రానున్న రెండు రోజుల్లో వరద ముంపు పెరిగితే కోనసీమలోని నదీపరివాహక లంక గ్రామాల ప్రజలకు గడ్డు పరిస్థితే. ఇళ్లు మునిగిపోవడంతో ఏటిగట్లపై తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకున్న బాధితులు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. వరద తగ్గుముఖం పట్టే వరకు తమ బతుకులు ఏటిగట్టుపైనే అంటూ లంకలగన్నవరం గ్రామంలో బాధితులు ఆవేదన చెందుతున్నారు.

ముంపు ప్రాంతాలకు కలెక్టర్..

అంతర్వేది, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ఒక లీటరు పామాయిల్, కిలో చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కోనసీమ జిల్లా పరిధి సఖినేటిపల్లి మండలం టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంకల్లో వరద ప్రభావిత ముంపు ప్రాంతాల్లో శనివారం పడవపై కలెక్టర్ ప్రయాణించి వరద బాధితులతో మాట్లాడారు. లంక ప్రాంతాల్లో సహాయక చర్యల నిర్వహణ తీరు పట్ల ఆరా తీశారు. అప్పనరామునిలంక ఓఎన్జీసీ కాలనీ, లాక్‌పేట, టేకిశెట్టిపాలెం, ఏటిగట్టును ఆనుకుని ఉన్న వరద బాధితులతో పాటు చెంచులతో మాట్లాడి వారికి అందుతున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు. పలువురు బాధితులకు కలెక్టర్ నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. మిగిలిన వారికి చౌకధరల దుకాణాల ద్వారా శని, ఆదివారం సాయంత్రానికి పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ముంపు బారిన పడి రాకపోకలు నిలిచిపోయిన బాధిత కుటుంబాల సంఖ్య 15 వేలకు చేరిందని, వారందరికీ నిత్యావసర సరుకులు ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ముంపు నీరు ఇళ్లలోకి చేరిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేలు ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 2022 గోదావరి వరద ప్రభావాన్ని, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ముంపు బారిన పడే 75 ఆవాసాల్లో సహాయక చర్యల సన్నద్ధతపై అన్ని చర్యలు చేపట్టామని, ముంపు బాధితులు ఆందోళన పడాల్సిన పరిస్థితి లేదన్నారు. సఖినేటిపల్లిలంక ముంపు ప్రాంతాల్లో పడవల రాకపోకల దృష్ట్యా ప్రమాదాల నివారణకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసినట్లు చెప్పారు. అనంతరం అప్పనరామునిలంక నుంచి రామరాజులంక వెళ్లే రహదారిలో కొన్నిచోట్ల హైట్ రోడ్డు వేస్తే వరద ముంపు బారినపడే అవకాశం ఉండదని కలెక్టర్‌కు బాధితులు వివరించారు. దాళ్వాలో ధాన్యం అమ్మిన సొమ్ములు చేతికి రాలేదని కొంతమంది రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2021లో వరద సహాయక చర్యల్లో భాగంగా బకాయిలు ఇంకా వసూలు అవ్వలేదని జిల్లా బీజేపీ నాయకుడు మాలే శ్రీనివాసనగేష్ కలెక్టర్‌కు వివరించారు. ఏడు మండలాల ఇన్‌చార్జి శ్రీనివాస్, తహసీల్దార్ పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, ప్రత్యేకాధికారి, ఏడీ హర్షవర్ధన్, సర్పంచ్ సుబ్బరాజు, మాజీ సర్పంచ్ బర్రే శ్రీను, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, సీఐ గోవిందరాజు, దిరిశాల బాలాజీ, ఏపీవో నాగప్రసాద్, ఏవో నరసింహారావు, కార్యదర్శి గంగరాజు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి



సమావేశంలో చర్చ జరుగుతున్న దృశ్యం

రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌పై

వాడివేడిగా చర్చ

- మార్పు చేసే అధికారం కౌన్సిల్‌కు ఉందా..?
- ఎవరైనా కోర్టుకు వెళితే పనులు మరింత జాప్యం
- అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల మధ్య చర్చోపచర్చలు

అమలాపురం టౌన్, జూలై 27: కోనసీమ రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ మార్పుచేస్తూ తీర్మానం చేసే అధికారం మున్సిపల్ కౌన్సిల్‌కు ఉందా అని అధికార పక్ష కౌన్సిలర్ సంసాని వెంకటచంద్రశేఖర్ ప్రశ్నించారు. కౌన్సిల్ చేసిన తీర్మానంతో ఎవరైనా కోర్టుకు వెళ్తే రైల్వేలైన్ నిర్మాణ పనులు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఒకసారి కేంద్రస్థాయిలో డీపీఆర్ పూర్తయిన తర్వాత ఎలైన్‌మెంట్ మార్పు చేయడంలో ఆంతర్యం ఏమిటని సభ్యులు ప్రశ్నించారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు రైల్వే లైన్ ఎలైన్‌మెంట్ అంశాన్ని లేవనెత్తారు. అమలాపురం పట్టణానికి తూర్పు ప్రాంతంలో ఉన్న కొందరు అభ్యంతరాలు తెలుపుతూ లేఖ ఇచ్చారు సరే రేపు పశ్చిమవైపు రైతులు, ప్రజలు అలాగే లేఖ ఇస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తయిందని, దాన్ని కాదని మాగాం, బండారులంక, పేరూరు మీదుగా రైల్వేలైన్ వెళ్తే పట్టణాభివృద్ధికి ఎటువంటి నష్టం ఉండదని పేర్కొనడంలో అర్థం లేదని పలువురు సభ్యులు వాదించారు. అమలాపురం మండలపరిషత్ పరిధిలోని తీర్మానాన్ని మున్సిపల్ కౌన్సిల్‌కు తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్ అబ్బిరెడ్డి చంటి మాట్లాడుతూ భవిష్యత్తులో అమలాపురం కార్పొరేషన్‌గా మారుతుందన్న కారణంగానే రైల్వేలైన్ ఎలైన్‌మెంట్‌ను మార్పు చేయమని కోరామన్నారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇచ్చిన లేఖను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపించేందుకు కౌన్సిల్ నిర్ణయించింది బ్లీచింగ్, ఆలం, శానిటరీ సామగ్రి, ఎలక్ట్రికల్ మెటీరియల్‌ను లక్షలాది రూపాయలు వెచ్చించి ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నారని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఆరోపించారు. మెటీరియల్‌ను కౌన్సిలర్లకు చూపించాలని ఎన్నిసార్లు కోరినా ఎందుకు చూపించడంలేదని ప్రశ్నించారు. దీనిపై కమిటీ వేయాలని కౌన్సిలర్ చంటి కోరడంతో అసలు పురపాలక సంఘంలో స్టాండింగ్ కౌన్సిల్ కమిటీలు ఎందుకు వేయడంలేదని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్‌ను ప్రాసిక్యూట్ చేసేవిధంగా కౌన్సిల్ తీర్మానం చేయాలని కోరారు. కమిషనర్ ఎస్.మనోహర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీలు ఎవరు ఏర్పాటు చేయాలో స్పష్టంచేస్తూ నోట్‌ఫైల్‌ను వారం రోజుల్లో పంపిస్తానని సమావేశం దృష్టికి తెచ్చారు. 5వ వార్డులో వాటరు పైపులైను వేయకుండా వేసినట్టు నివేదికలు ఇస్తున్నారని, అదేవిధంగా పట్టణంలోని పలు వార్డుల్లో చేయని పనులు చేసినట్టు, చేసిన పనులు చేయనట్టు ఆన్‌లైన్‌లో చూపిస్తున్న వ్యవహారాలపై కౌన్సిలర్లు బొర్రా చిట్టిబాబు, గొవ్వాల రాజేష్, సాంసాని బులినాని ప్రశ్నించారు. సంబంధిత ఫైళ్లను సమావేశంలో చూపించాలని పట్టుబట్టారు. ఎంబుక్‌లు కాంట్రాక్టరు వద్దే ఉంటున్నాయని, అధికారుల బీరువా తాళాలు సైతం వారివద్దే ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. నోట్ ఫైల్స్ కనిపించని తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేయగా ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులతో డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు. 'పురపాలక సంఘంలో గతంలో మంజూరు చేసిన రూ.2 కోట్ల పనులు ఇంతవరకు పూర్తికాలేదు. ఇప్పుడు మరో రూ.2 కోట్లతో పనులు ప్రతిపాదిస్తున్నారు. అసలు పురపాలక సంఘంలో ఎంత మేర బిల్లులు పెండింగ్ ఉన్నాయి' అని సభ్యులు ప్రశ్నించారు. కమిషనర్ మనోహర్ మాట్లాడుతూ రూ.9 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉందని, ప్రస్తుతం పురపాలక సంఘంలో రూ.6 కోట్లు నిధులు ఉన్నాయని అందుకే నోట్ ఫైల్‌లో నిధుల కొరత విషయాన్ని ప్రస్తావించినట్టు పేర్కొన్నారు. పురపాలక సంఘంలో టాయిలెట్లు, వాష్‌రూమ్‌లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కౌన్సిలర్ పిండి అమరావతి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సైనికులకు ఇంటి పన్నులు మినహాయిస్తూ ప్రభుత్వం జీవో నంబరు 83 విడుదల చేసిందని, 41 నెలలుగా ఏ ఒక్క మాజీ సైనికుడికైనా ఇంటిపన్ను మినహాయించారా అని కౌన్సిలర్ తిక్కా సత్యవతి ప్రశ్నించారు. టిడ్కో భవనాల్లో లోటుపాట్లను ఎందుకు సరిదిద్దడంలేదని, అప్పట్లో రూ.లక్ష చొప్పున చెల్లించిన వారికి ఇంత వరకు ఆ మొత్తాలను ఎందుకు చెల్లించలేదని, అసలు టిడ్కో భవనాలు పొందినవారు ఉంటున్నారా, అద్దెకు ఇచ్చేశారా అంటూ సభ్యులు యేడిద శ్రీను తదితరులు ప్రశ్నించారు. 10వ వార్డులో అనధికార లేఅవుట్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి ప్రశ్నించారు. కుక్కల స్వైరవిహారం, రోడ్లపై పశువుల సంచారం. వాటర్ పైపులైన్ల అంశాలపై సభ్యులు బండారు గోవిందు, వాసర్ల లక్ష్మి, గండి దేవిహారిక ప్రశ్నించారు. కౌన్సిల్ ఎక్స్ అఫిషియో సభ్యునిగా తొలిసారి సమావేశానికి విచ్చేసిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను అధికార, విపక్ష కౌన్సిలర్లు, అధికారులు సత్కరించారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి సుభాష్

ఏటిగట్ల పటిష్టానికి ప్రభుత్వం చర్యలు

- మంత్రి సుభాష్

కె.గంగవరం, జూలై 27: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 13 చోట్ల బలహీనంగా ఉన్న ఏటిగట్లను పటిష్టం చేసేందుకు రూ.140 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం గుర్తించిందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కూళ్ల, సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్లను శనివారం ఆయన పరిశీలించారు. సుందరపల్లి, కూళ్ల వద్ద బలహీన ఏటిగట్లు పటిష్టపరచడానికి రూ.55 కోట్లు అవసరమని చెప్పారు. ప్రస్తుతం రూ. 55 లక్షలతో తాత్కాలిక పటిష్ట చర్యలు చేపట్టామని తెలిపారు. వరదలు తగ్గిన తర్వాత శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు. కోటిపల్లి మత్స్యకార కాలనీలోని మాధవనగర్‌లో వరద చేరిన ఇళ్లను మంత్రి సుభాష్ పడవపై వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిత్యావసర కిట్‌లు పంపిణీ చేశారు. రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్, ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్, తహసీల్దార్ రవీంద్రనాథ్, సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, పప్పుల సాయిబాబు, గొడవర్తి రామకృష్ణ, తాడాల జానకిరామ్, కర్రి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ కృష్ణారావు

రాయవరం, జూలై 27: రాయవరం పోలీస్‌స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఎస్పీకి ఎస్ఐ జి.నరేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణ, పరిసరాలు, లాకప్‌ను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసులు వివరాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు, మండలంలోని 12 గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్ కుమార్, ఏఎస్ఐ పి.వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రాయవరం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న సింహాచలం

ఐటీడీఏ పీవోగా సింహాచలం

బాధ్యతల స్వీకరణ,,, సిటిజన్ ఎంగేజ్‌మెంట్ టీములు ఏర్పాటు చేస్తానని ప్రకటన

రంపచోడవరం, జూలై 27: రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా కట్టా సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన సీతపల్లి శ్రీగడి బాపనమ్మ, ఐ.పోలవరం సమీపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజనుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా సిటిజన్ ఎంగేజ్ టీములు ఏర్పాటు చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా అధికారులు, సిబ్బందితో కలిసి ముందుకు సాగుతానన్నారు. పీవోకు ఏపీవో (జి) సీహెచ్ శ్రీనివాసరావు, పరిపాలనాధికారి డీఎస్వీ రమణ స్వాగతం పలికారు. డిప్యూటీ డైరెక్టర్ కె.అలూసలా, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీడీ జి.శ్రీనివాసరావు, ఎస్‌వో టి.మార్తమ్మ తదితరులు పీవోను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.



జగపతిబాబుకు మొక్క అందజేస్తున్న నర్సరీ రైతులు

పల్ల వెంకన్న నర్సరీలో జగపతిబాబు

కడియం, జూలై 27: తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక పల్ల వెంకన్న నర్సరీని ప్రముఖ హీరో జగపతిబాబు శనివారం సందర్శించారు. ఆయనకు పల్ల వెంకన్న కుమారులు సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, గణపతి, మనుమలు వెంకటేష్, వినయ్ పీస్ లిల్లీ అనే మొక్క అందజేసి స్వాగతం పలికారు. నర్సరీలో వివిధ రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్ మొక్కలను చూసి కొన్ని రకాల మొక్కలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీతో తనకు ఏనాటి నుంచో అనుబంధం ఉందన్నారు. 'పెళ్ళైన కొత్తలో' చిత్రం షూటింగ్ చాలా వరకు ఈ నర్సరీలోనే జరిగిందని, పలు చిత్రాల షూటింగ్‌లకు కూడా వచ్చానని చెప్పారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు

ఆత్రేయపురం, జూలై 27: కోనసీమ తిరుమల వాడపల్లికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగాలను శాస్త్రోక్తంగా నిర్వహించి శ్రీవేంకటేశ్వర స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తీరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.34.79 లక్షలు లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. పార్కింగ్ ప్రదేశాలు బురదమయంగా మారడంతో వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది అయ్యింది. దీంతో రోడ్డుపక్కనే నిలుపుదల చేశారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎక్కడికక్కడే వాహనాలు నిలిపివేయడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వచ్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

డీఎల్ఎంటీలకు ముగిసిన శిక్షణ

సామర్లకోట, జూలై 27: కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్ర ఆవరణలో 11 జిల్లాలకు చెంది డీఎల్ఎంటీలకు తొమ్మిది రోజులుగా ఇచ్చిన శిక్షణా తరగతులు శనివారం సాయంత్రం విజయవంతంగా ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ మాట్లాడుతూ శిక్షణను క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేయడం ద్వారా పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. శిక్షణార్థులకు సర్టిఫికెట్లను ప్రిన్సిపాల్ అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడు బ్యాచ్‌లుగా వ్యవసాయ, విద్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలకు చెంది 255 మంది అధికారులు 11 జిల్లాల నుంచి పాల్గొన్నారని తెలిపారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ప్రసాద్, నీహారిక, ఆంజనేయులు, చక్రపాణీరావు, పద్మజ పాల్గొన్నారు.



కాటన్ బ్యారేజీ నుంచి సముద్రంలోకి ఉరకలెత్తుతూ ప్రవహిస్తున్న గోదావరి

ఉగ్ర గోదావరి

» ధవళేశ్వరం వద్ద మరలా రెండో ప్రమాద హెచ్చరిక జారీ » 14.50 అడుగులకు చేరిన నీటిమట్టం » 13.92 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 27: గోదావరి పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహానికి ఉప నదుల నుంచి వస్తున్న వరద నీరు తోడవడంతో ఉగ్రరూపం దాల్చింది. సీజన్లో మొదటిసారిగా భద్రాచలం వద్ద 53 అడుగులకు పైగా ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద 14 అడుగులకు చేరుకుని ప్రమాదకరంగా వుంది. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు స్వల్పంగా తగ్గిన నీటిమట్టం 13.40 అడుగులకు చేరుకుంది. అటుపై ఎగువ నుంచి వచ్చే వరద నీటితో నీటిమట్టం పెరగడం ప్రారంభించి మధ్యాహ్నం 3 గంటలకు 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజీ నుంచి 13లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. ఆపై నీటిమట్టం మరింత పెరుగుతూ రాత్రి 7 గంటలకు 14 అడుగులకు చేరుకోగా 13.20, 274 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 15 అడుగులకు పైగా పెరిగి ఆపై తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరిగిన నీటిమట్టం ప్రమాదకర స్థాయి 53 అడుగులు దాటి రాత్రి ఏడు గంటలకు 53.60 అడుగులకు చేరింది. తాలిపేరు ప్రాజెక్టు నుంచి 1.20లక్షలకు పైగా నీటిని విడుదల చేస్తుండడంతో ఆ ప్రభావంతో భద్రాచలం వద్ద ప్రస్తుతం నీటిమట్టం పెరుగుతోంది.

ఎగువ నీటి మట్టాలు

శనివారం సాయంత్రానికి ఎగువున కాళేశ్వరం వద్ద 9.47 మీటర్లు, పేరూరు వద్ద 16.80 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.59 మీటర్లు, భద్రాచలం వద్ద 53.40 అడుగులు, కూనవరం వద్ద 21.48 మీటర్లు, కుంట వద్ద 13.15 మీటర్లు, పోలవరం వద్ద 13.26 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.08 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ధవళేశ్వరం వద్ద గోదావరికి శనివారం మధ్యాహ్నం 3గంటలకు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం రాత్రి 12 గంటలకు 14.50 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కన్జర్వేటర్ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు ప్రమాద హెచ్చరిక జారీచేస్తూ ఫ్లడ్ సెక్షన్ అధికారులు వారికి కేటాయించిన ఏటిగట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈఈలు, డీఈలు, ఏఈలు, ఫ్లడ్ సూపరింటెండెంట్, ఫ్లడ్ సెక్షన్ ఆఫీసర్లుగా విధులు చేపట్టారు. బలహీన ఏటిగట్ల వద్ద, అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టారు.

ఎటుచూసినా వరద నీరే

గంటగంటకూ పెరుగుతున్న శబరి... ఉధృతంగా ప్రవహిస్తున్న సీలేరు.... ఎగువ పోటునిచ్చిన గోదావరి

చింతూరు, జూలై 27: ఎటు చూసినా వరద నీరే కనిపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎటపాక మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శనివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి వరద 53.3 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 42 అడుగులుగా నమోదైంది. డొంకరాయి రిజర్వాయరు నుంచి నాలుగు గేట్ల ద్వారా 13,124 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో సీలేరు నది ఉధృతమైంది. మొత్తం మీద విలీన మండలాల్లో వరద గంటగంటకూ పెరుగుతోంది. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి ఇప్పటికే వారం దాటింది. లోతట్టు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వరద ఉధృతితో ముంపు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద పెరుగుతున్నందున లోతట్టు వాసులందరూ సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు హెచ్చరిక జారీ చేశారు. దీంతో వారంతా సామగ్రి సర్దుకుని పరుగులు తీస్తున్నారు. గుట్టలు, మెట్టల్లో టార్పాలిన్లతో కూడిన పాకలు వేసుకుని తల దాచుకుంటున్నారు. చింతూరు మీదుగా విజయవాడ వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారితో పాటు ఒడిసా వెళ్లే 326వ నెంబరు జాతీయ నెంబరు రహదారి కూడా జలదిగ్బంధమైంది. దీంతో తెలంగాణ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చింతూరు మీదుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గ్రామాల్లో వరద నీరు భారీగా చేరడంతో గ్రామాల్లో నాటు పడవలపై ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం మండల కేంద్రాల్లోకి వరద నీరు చేరింది.



వీఆర్ పురం మండలం చింతరేగుపల్లి గ్రామాన్ని ముంచెత్తిన వరద నీరు

రేపు కాకినాడలో జాబ్ మేళా

కాకినాడ సిటీ, జూలై 27:

కాకినాడలో వికాస ఆధ్వర్యంలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. ముత్తూట్ ఫిన్‌కాప్ లిమిటెడ్ కంపెనీలో సర్వీస్ ఎగ్జిక్యూటివ్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, కెమిస్ట్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్, హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటాయన్నారు. ఆసక్తి గల వారు సోమవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయానికి సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76111 నెంబరును సంప్రదించాలని లచ్చారావు కోరారు.

మహిళపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 27:

కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలో మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. సరిహద్దు గోడ విషయంలో తగాదాలతో పట్టణంలోని రంగప్పచెరువు వీధికి చెందిన నేకూరి రాజ్యలక్ష్మిపై అదే ప్రాంతానికి చెందిన వేమగిరి రాజేష్ గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాజేష్‌ను అరెస్టు చేసి దాడికి ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌ను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ జాన్‌బాషా తెలిపారు.



భువనేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా....

రాజమహేంద్రవరం సిటీ, జూలై 27: రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్ అధినేత సుధాకర్ శనివారం ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి సీఎం నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి హాజరయ్యారు. ఆమెను రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన అల్లుడు అన్నె రామకృష్ణ, కుమార్తె అన్నె స్మిత, పలువురు టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి ఆప్యాయంగా పలకరించారు.



12 గంటల్లో పట్టేశారు

రూ.2కోట్లు కొట్టేయడానికి యత్నించిన ఉద్యోగిని అరెస్టు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంల్లో ఉంచాల్సిన డబ్బులతో ఉడాయించాలనుకున్న ఉద్యోగి ఆటకట్టించిన పోలీసులు 12 గంటల్లోనే కటకటాల్లోకి నెట్టారు. దీనికి సంబంధించి శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం మాచరమట్లకు చెందిన వాసంశెట్టి అశోక్‌కుమార్ బ్యాంకు ఏటీఎంల్లో డబ్బులు నింపే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో 2018 నుంచి నెలకు రూ.11వేల జీతానికి సార్టర్ అసిస్టెంట్‌గా పొరుగు సేవల విధానంలో పనిచేస్తున్నాడు. ఈ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంల్లో డబ్బులు నింపుతుంది. ఈ నెల 26వ తేదీ (శుక్రవారం) మధ్యాహ్నం సమయంలో ఏటీఎంల్లో పెట్టేందుకు బ్యాంకు నుంచి రూ.3,32,50,000 తీసుకున్నాడు. రూ.1.12 కోట్లను మరో ఉద్యోగి హరీశ్‌గౌడ్, ఆదిత్య, రూట్ ఆఫీసర్ దొంతల సునీల్‌కుమార్ (ఫిర్యాది)లకు ఇచ్చాడు. మిగతా రూ.2,20,50,000 వారం క్రితం వేసుకున్న పథకం ప్రకారం తాను అద్దెకు తెచ్చుకున్న కారులో పెట్టుకుని ఉడాయించాడు. దీనిపై మధ్యాహ్నం 3 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు మొదలుపెట్టారు. ఈ క్రమంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రాజానగరం మండలం చక్రద్వారబంధం సమీపంలో అనుమానాస్పదంగా వ్యవహరించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష ఉండగా సదరు వ్యక్తిని నిందితుడు అశోక్‌కుమార్‌గా గుర్తించారు. అదే గ్రామంలో అద్దెకు తీసుకున్న రాఖీ అవెన్యూస్ అపార్ట్‌మెంట్‌లోని గంగా బ్లాక్ ఫ్లాట్ నెం.104లో దోపిడీ డబ్బును దాచి... లక్ష మాత్రం తీసుకుని కొంతకాలం కనిపించకుండా ఉందామని అశోక్ చెప్పాడు. ఫ్లాట్‌లో దాచిన రూ.2,19,50,000 స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు చెడు వ్యసనాలకు, విలాస జీవనానికి అలవాటుపడి ఈ నేరానికి పాల్పడినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. ఉన్నతాధికారుల సూచనలతో సాంకేతికత సహాయంతో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ అనుసరించి నిందితుడిని కేవలం 12గంటల్లో అరెస్టు చేశారు. కేసు ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ విజయపాల్, త్రీటౌన్ (వన్‌టౌన్ ఇన్చార్జి) సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



నాలుగు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

డొంకరాయి జలాశయానికి భారీగా వరద నీరు

మోతుగూడెం, జూలై 27: భారీగా కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి వాగుల నుంచి వచ్చే ఇన్‌ఫ్లోస్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం నీటి విడుదలను 10,936 క్యూసెక్కులకు పెంచామని జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ఈ నెల 24 వరకు కురిసిన వర్షాలకు 1035.5 అడుగులకు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమై నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి 2,173 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే 26వ తేదీ నాటికి ఇక్కడ వరదనీరు మరింత చేరడంతో శుక్రవారం అర్ధరాత్రి 3వ గేటు (6వ నెంబరు గేటు) రెండు అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా శనివారం ఉదయం నాటి జలాశయంలోకి ఇంకా ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో 4వ గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసి నీటి మట్టం 1036 అడుగుల వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా జెన్‌కో అధికారులు చర్యలు చేపడుతున్నారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు శనివారం జలాశయం వద్దకు చేరుకుని ఇన్‌ఫ్లోస్, దిగువకు నీటిని విడుదల చేస్తున్న వివరాలను ఈఈ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. జలాశయానికి వరద తాకిడి తగ్గేంత వరకు సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఇంజనీర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి విడుదల, ఇన్‌ఫ్లోస్ సమాచారాన్ని అధికారులకు చెప్పాలని సూచించారు. ఈఈ బాలకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, చింతపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. డొంకరాయిలోని ఏపీపీ డ్యామ్ కూడా వరద తాకిడి అధికం కావడంతో శనివారం రెండు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.



ఎటపాక-చెన్నంపేట గ్రామాల మధ్యలో రహదారిపై చేరిన వరద నీరు

గిరిజన గ్రామాలను ముంచెత్తిన వరద నీరు

ఎటపాక, జూలై 27: మండలంలోని గన్నవరం, గొల్లగూడెం, నందిగామ, ఎర్రగట్టు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. ఇళ్ల ఆవరణల్లోకి నీరు చేరడంతో బాధిత ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో గత మూడు రోజులుగా ఈవైపు రాకపోకలు స్తంభించాయి. మురుమూరు, నందిగామ, గన్నవరం, నెల్లిపాక, రాయనపేట, గౌరిదేవిపేట, చోడవరం ఎటపాక ప్రధాన రహదారిను వరద నీరు ముంచెత్తింది. శనివారం ఉదయం భద్రాచలం- కూనవరంతో పాటు ఎటపాక-తెలంగాణ వైపుగా రాకపోకలు నిలిచాయి. విస్సాపురం పంచాయతీలోని ఎర్రగట్టు గిరిజన గ్రామంలో బోటుకు డిజిల్ ఏర్పాటు చేయకపోవడంతో గ్రామ సెక్రటరీ, ప్రజాప్రతినిధులు నడుము లోతు వరద నీటిలో వెళ్లి బాధితులకు కూరగాయలు అందించారు. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం ఉదయం వరద ప్రవాహంలో ప్రమాద అంచున భద్రాచలం వైపు వెళ్లింది. అందులోని ప్రయాణికులు ఒకింత భయాందోళన చెందారు.



రాయనపేట వద్ద వరద నీటిలో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు, ఎర్రగట్టులో వరద నీటిలో నిత్యావసరాలు తీసుకెళ్తున్న సెక్రటరీ, ప్రజాప్రతినిధి

శృంగార వల్లభస్వామి ఒక్కరోజు ఆదాయం రూ.2.38 లక్షలు

పెద్దాపురం, జూలై 27: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు ఐదు వేల స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,56,590 అన్నదాన విరాళాలు రూ.48,281, కేశఖండన ద్వారా రూ.4,080, తులాభారం రూ.300, లడ్డూ ప్రసాదం ద్వారా 18,690, నామకరణం ద్వారా రూ.200... మొత్తం రూ.2,38,141 ఆదాయం సమకూరినట్టు ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం అర్చకుడు పెద్దింటి నారాయణాచార్యులు పాల్గొన్నారు.

నవోదయలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జూలై 27: జవహర్ నవోదయ విద్యాలయలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. సెప్టెంబరు 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందినవారై, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి అంతరాయం లేకుండా చదువుతూ ఉండాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 45 కేంద్రాల్లో వచ్చే సంవత్సరం జనవరి 18న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు.

ఓడలరేవు బీవీసీలో ఐడియా కాంటెస్ట్ సాంకేతిక సదస్సు

అల్లవరం, జూలై 27: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐసీసీ, కంప్యూటర్స్ సైన్సు విభాగం ఆధ్వర్యంలో ఐడియా కాంటెస్ట్ 2కే 24 సాంకేతిక సదస్సు విజయవంతంగా జరిగింది. ఇంజనీరింగ్ విద్యార్థులు అధునాతన పరిజ్ఞాన అంశాలపై ప్రదర్శించారు. ఏఐ క్లౌడ్ రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్‌డేటా అంశాలపై విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌పీ చంద్ర మౌళి, ఏ.ప్రవీణ్, డాక్టర్ ఏ.రామకృష్ణ, బీఎస్ఎన్ మూర్తి, మధుకుమార్, డాక్టర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

•అమలాపురం • పి.గన్నవరం • రాజోలు • ముమ్మిడివరం • కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



మామిడికుదురు: అప్పనపల్లి ఉచ్చులవారితోట నుంచి వెళ్లే రోడ్డుపై వరద నీరు



కపిలేశ్వరపురం: శ్రీరాంపురం వద్ద వరదనీటిలో దొండపంట



ముమ్మిడివరం: గురజాపులంక వద్ద స్వల్పంగా పెరిగిన వరదనీరు



ఆలమూరు: జొన్నాడ బ్రిడ్జిల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఉధృతంగా గోదావరి

- నీట మునిగిన వాణిజ్య పంటలు
- భయం గుప్పెట్లో లంక గ్రామాల ప్రజలు
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన నాయకులు

మామిడికుదురు, జూలై 27:ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ధవళేశ్వరం, భద్రాచలంవద్ద రెండో ప్రమాద హెచ్చరికలు జారీ చేయడంతో గోదావరి నదికి వరద పోటెత్తింది. దీంతో లంకగ్రామాల్లో తిరిగి వరద ప్రవాహం పెరిగింది. గోదావరికి వరద ప్రవాహం తగ్గి పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అప్పనపల్లి కాజ్‌వేపై వరద పోటెత్తడంతో రాకపోకలను నిషేధించారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలకు వెళ్లే ప్రజలు మామిడికుదురు నుంచి అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా ఆయా గ్రామాలకు వెళుతున్నారు. ఆ రహదారిపై కూడా వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్నారు. ఉచ్చులవారిపేటలోని చర్చి వద్ద వడి ఎక్కువగా ఉంటుందని స్థానికుల పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరదనీరు చేరింది. అప్పనపల్లిలోని ఇందిరమ్మ కాలనీ, మొల్లేటివారిపాలెం, పాశర్లపూడిలోని శ్రీరామపేట, పళ్లవపాలెం తదితర ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల్లో పండించే కాయగూర పంటలు వరదనీటిలో చిక్కుకుని పనికి రాకుండా పోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పనపల్లి బాలబాలాజీ దర్శనాలను నాలుగు రోజులు నిలిపివేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న వరదనీరు

ముమ్మిడివరం: గోదావరి ఎగువ భాగాన వరద ఉధృతి పెరగడంతో దిగువనున్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాల్లో వరదనీరు శనివారం నుంచి స్వల్పంగా పెరుగుతోంది. వివేకానంద వారధి-గురజాపులంక సిమ్మెంటు రోడ్డుపై కూనాలంక, గురజాపులంక వద్ద శుక్రవారం కన్నా శనివారం నాటికి అడుగు మేర నీటిమట్టం పెరిగింది. గురజాపులంక, కూనాలంక, లంకాఫ్‌ఠాణేలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక, కమిని, సలాదివారిపాలెం తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు పెరుగుతోంది. దీంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలావుండగా వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు 260 కుటుంబాలకు 25 కిలోల వంతు బియ్యం, కిలో వంతున నూనె, కందిపప్పు, ఉల్లి, బంగాళదుంపలు పంపిణీ చేశారు. లంక గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో మంచినీటి సరఫరాను యధాతథంగా చేస్తున్నారు. వరద సహాయక ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, తహసీల్దార్ బి.శ్రీనునాయక్, వీఆర్వోలు, సర్పంచ్ కొప్పిశెట్టి కృష్ణమూర్తి తదితరులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

కపిలేశ్వరపురం: లంకగ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక గ్రామాల్లోని అరటి, బెండ, వంగ, కంద, బీర, తదితర కూరగాయ పంటలు వరదనీటిలో చిక్కుకున్నాయి. వరద తగ్గుముఖం పట్టిందన్న సమయంలో మరలా వరద ఉధృతి పెరగడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి పుష్కర ఘాట్‌లవద్ద వరద ఉధృతి పెరిగింది. కోరుమిల్లి లంకలో వేసిన పంటలు పూర్తిగా నీటమునగడంతో అవి పనికిరాకుండా పోయాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. లంకగ్రామాల్లో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు కొనసాగిస్తున్నారు. అధికారులు వరదల పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

బడుగువాని లంకకు పొంచి ఉన్న ప్రమాదం

ఆలమూరు: గోదావరి వరదతో ఆలమూరు మండలంలంక గ్రామమైన బడుగువానిలంకకు ప్రమాదం పొంచి ఉంది. భద్రాచలం వద్ద గోదావరి వరదనీరు ఉధృత ంగా ఉండటంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో ఆదివారం ఉదయానికి ధవళేశ్వరం బ్యారేజ్ వద్దకు వరద నీరు బాగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యారేజ్‌కు దిగువన ఉన్న బడుగువానిలంకకు ఈసారి వరదనీరు వచ్చే అవకాశం ఉండటంతో గ్రామస్తులు భయం గుప్పెట్లో గడుపుతున్నారు. ఆ గ్రామంలో లోతట్టు ప్రాంతాలలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఎగువ నుంచి వరదనీరు అధికంగా విడుదల కావడంతో జొన్నాడ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం వరద ఉధృతంగా ప్రవహిస్తోంది.

పుష్కరఘాట్‌లను ముంచెత్తిన వరద

ఆత్రేయపురం: గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. శనివారం సాయంత్రానికి 14 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. కాటన్ బ్యారేజీ 175 గేట్లను ఎత్తి 13.14 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కర ఘాట్లు వరదకు మునిగిపోయాయి. భక్తులు స్నానాలకు వెళ్లకుండా మెస్‌లు ఏర్పాటు చేశారు. లంక భూముల్లోని వివిధ పంటలు పెరిగిన వరదకు కొట్టుకునిపోయాయి. పిచ్చుకలంకకు చెందిన నిర్వాసితులు గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు.

యానాం: యానాం గౌతమి గోదావరిలో వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతోంది. దీంతో యానాంకు వరద ప్రభావం ఎక్కువగా ఉండంటతోపాటు యానాం జీఎంసీ బాలయోగి వారధివద్ద వరద ప్రవాహం ఉధతంగా ప్రవహిస్తుంది. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు యానాం పరిపాలనాధికారి మునిస్వామి సమీక్షించడంతో పాటు ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

నదీకోత నివారణకు చర్యలు: ఎమ్మెల్యే గిడ్డి

అయినవిల్లి: గోదావరి నదీకోత నివారణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం వరద ముంపు గ్రామాలైన పొట్టిలంక, యలకల్లంక, కొండుకుదురులంక, అయినవిల్లిలంక, ఎదురుబిడియం కాజ్‌వేల వద్ద వరద పరిస్థితిని ఆయన పరిశీలించారు.. నదీకోతకు గురైన గ్రామాల్లో ఆయన పర్యటించారు. వరద పరిస్థితిని సమీక్షించారు. కాజ్‌వే నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. వరద ముంపు బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరదల ప్రత్యేకాధికారి వి.శివశంకరప్రసాద్, మండల ప్రత్యేకాధికారి జి.సత్యనారాయణ, తహసీల్దార్ ప్రమద్వర, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, కుడుపూడి బుజ్జి, సలాది పుల్లయ్యనాయుడు, సయ్యపరాజు సత్యనారాయణరాజు, సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, కోనే సునీతను బ్బలక్ష్మి, గుత్తాల రమాదేవి, బొబ్బా ప్రభాత్‌కుమార్, నేదునూరి వీర్రాజు, పోలిశెట్టి రాజేష్, కాకర శ్రీనివాస్, కడలి వెంకటసత్యనారాయణ, మామిళ్లపల్లి తాతయ్యనాయుడు, జంగా డేవిడ్ రాజు, మద్దాలసుబ్బారావు, తొత్తరమూడి ప్రభాకరరావు, బడుగు భాస్కరజోగేష్ పాల్గొన్నారు.

గోపాయిలంకలో కొట్టుకుపోయిన స్లూయిజ్ తలుపులు

అల్లవరం: అల్లవరం మండలం గోపాయిలంక వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ తలుపు కొట్టుకుపోయి డ్రైయిన్‌లోకి వరద ముంపు ఎగదన్నింది. ఇరిగేషన్ హెడ్‌వర్క్స్, డ్రైయిన్స్ అధికారులు పట్టించుకోక అవుట్ ఫాల్‌స్లూయిజ్ తలుపు ఊడిపోయి కౌశిక డ్రైయిన్ వరదముంపు బారిన పడింది. దీంతో అల్లవరం పరిసర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మండపేట రూరల్ పోలీసుస్టేషన్ తనిఖీ



మండపేట రూరల్‌పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ

మండపేట, జూలై 27: జిల్లా ఎస్పీ కృష్ణారావు శనివారం మండపేట రూరల్ మండల పోలీసు స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేశారు. ఆయన రూరల్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌పరిధిలో క్రైమ్ రేటు గురించి ఆయన ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలో వరదల నేపథ్యంలో ప్రజలకు తమ పోలీసుశాఖ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామ న్నారు. ఆయన వెంట రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, రూరల్ ఎస్.ఐ చైతన్యకుమార్ ఉన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ):రామచంద్రపురం పోలీస్‌స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు సందర్శించారు. రామచంద్రపురం డివిజన్‌లో శాంతిభద్రతలు పరిస్థితులుపై డీఎస్పీ బి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ కె.శ్రీధర్‌కుమార్, ఎస్ఐ సురేష్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వరదలపట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కపిలేశ్వరపురం: వరదలుపట్ల పోలీసులు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని అంగర పోలీస్‌స్టేషన్ ను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్ రికార్డులను తనిఖీచేసి క్రైంరేటును, సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

'మెరుగైన విద్యాబోధనకు టీచ్‌టూల్'

అమలాపురం టౌన్, జూలై 27: మెరుగైన విద్యాబోధనకు, తరగతి గదుల్లో ప్రతీ విద్యార్థిని ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా టీచ్ టూల్ శిక్షణ ఎంతగానో దోహద పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, సమగ్ర శిక్షా అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి మధుసూదనరావు చెప్పారు. అమలాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్‌టూల్ శిక్షణ శనివారం ముగింపు సభ నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణలో పొందిన అంశాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, దుర్గాదేవి, పి.రాంబాబు, బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, రాజ్యలక్ష్మి, శ్రీనుబాబు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

'మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి'

అంబాజీపేట, జూలై 27: అమ్మ పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేస్తుందో అదే మాదిరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతగా ప్రతిఒక్కరూ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి అన్నారు. నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ 6వ రోజు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలిసి ఆమె అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఎ.మధుసూదనరావు, సమగ్ర శిక్ష సిక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంకే భీమారావు, ఎంఈవో మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు అంకితం

ఉప్పలగుప్తం, జూలై 27: భీమనపల్లి హైస్కూల్లో శనివారం అమ్మకు అంకితం కార్యక్రమం నిర్వహించారు. మాతృమూర్తులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు తల్లులతో కలిసి విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలంటూ నినదిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్‌వీఎస్ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అరవ నాయుడు, నడింపల్లి పద్మనాభన్, ముత్యాల నరసింహమూర్తి, పీడీ కామన మధుసూదనరావు, వేటూరి వెంకటేశ్వరరావు, పెండ్యాల శ్రీనివాస్, జనుపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సౌకర్యాలు పెంచే దిశగా పనిచేయాలి

- సమావేశంలో ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ, కౌన్సిలర్ సతీష్‌కుమార్

ముమ్మిడివరం, జూలై 27: వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం సంక్షేమ పథకాలకే ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ముమ్మిడివరం నగర పంచాయతీ ప్రజల సౌకర్యాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్, ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ పేర్కొన్నారు. నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో ఫ్లోర్ లీడర్ బాలకృష్ణ, కౌన్సిలర్ సతీష్‌కుమార్‌లు మాట్లాడుతూ గత 20 రోజులుగా వర్షాలు విపరీతంగా కురవడంతో రోడ్లపై నీరు దిగకపోవడంతో రోడ్లు, డ్రైనేజీలు అధ్వానంగా మారి దోమలు పెరిగి ప్రజలు డెంగ్యూ జ్వరాలబారిన పడుతున్నారని, బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 7, 8 వార్డులు సాయినగర్‌లో డ్రైన్ అవుట్‌లెట్ మూసుకుపోయాయన్నారు. అక్కడ చర్చిని నిర్మిస్తున్నవారు, అపార్టుమెంటువారు వేస్ట్ మెటీరియల్‌ను పడవేయడంతో డ్రైనేజీలు మూసుకుపోయి మురుగునీరు దిగడంలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్లీచింగ్, క్లోరినేషన్ సక్రమంగా చేయడంలేదని వారు ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు 20 వార్డుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని, నిధుల సమస్య ఉంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. మాగాం-అయినాపురం పంటకాల్వ తొట్టె రక్షణగోడ కొంతమేర కూలిపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంతో వాటి మరమ్మతులకు ఎమ్మెల్యే రూ.4లక్షలు ప్రత్యేక గ్రాంటును విడుదలచేసి పనులు చేయించారని కౌన్సిలర్ సతీష్‌కుమార్ ఈ సందర్భంగా వివరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అస్తవ్యస్తంగా మారిందని, ఒక్క ఆదివారం మాత్రమే ఇంటికి శ్లాబ్ వేసుకునే పరిస్థితి వచ్చిందని, టౌన్ ప్లానింగ్ ఉద్యోగుల వేధింపులు ఎలా ఉన్నాయో అర్థం అవుతుందని వైసీపీ కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాసరావు ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారుల వైఖరి మార్చుకోకపోతే ఆర్డీడీ వద్ద ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. సచివాలయ ప్లానర్లు అప్రూవల్‌కు వచ్చిన దరఖాస్తులను 15 రోజులైనా లాగిన్‌లో ఉంచుకుంటున్నారని, రెండు రోజుల వ్యవధిలో క్లియరెన్స్ చేయాల్సిన వాటికి ఎందుకు అంత జాప్యం చేస్తున్నారని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదని, మురుగునీటి మలినాలు వస్తున్నాయని, వాటర్ ట్యాంకును శుభ్రం చేయడంలేదని కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్, ములపర్తి బాలకృష్ణ, బొంతు సత్యశ్రీనివాస్‌లు ఆరోపించారు. దీనిపై ఏఈ సత్యనారాయణ వివరణ ఇస్తూ మోటార్లతో అక్రమంగా నీటిని వినియోగించడంవల్ల ఈ పరిస్థితి వస్తుందని వివరించారు. అలాగే కౌన్సిల్‌లో పలు విషయాలపై చర్చ జరిగింది. సమావేశంలో వైస్ చైర్మన్లు రెడ్డి హేమసుందరి, వేటుకూరి బోసురాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వానపల్లి 30వ రేషన్‌షాపు సీజ్

- డీలర్ లేకుండా బినామీగా క్లోనింగ్ తంబ్‌తో షాపు నడిపిన వైనం
- ఐదుగురిపై క్రిమినల్ కేసు నమోదు

కొత్తపేట, జూలై 27: కొత్తపేట మండల వానపల్లి గ్రామంలో 30వ రేషన్‌షాపును రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అక్కడ విధులు నిర్వహించాల్సిన డీలర్ లేకుండా ఆమె వేలిముద్రను క్లోనింగ్ చేసి ప్లాస్టిక్ వేలిముద్రతో వైసీపీకి చెందిన కొందరు బినామీలు షాపు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదుతో విచారణ చేసి వాస్తవాలు వెలుగు చూడటంపై సంబంధిత డీలర్ సహా ఐదుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వానపల్లి 30వ రేషన్‌షాపును మత్రివారిపేటకు చెందిన డ్వాక్రా గ్రూప్ శ్రీ దుర్గా ఎంఎస్ఎస్ గ్రూపునకు చెందిన మత్రి శ్రీకళ నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మత్రి శ్రీకళ పెళ్లి చేసుకుని అత్తవారి ఇంటికి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఆమె నిర్వహించే రేషన్‌షాపును కొందరు బినామీలు నకిలీ వేలిముద్రతో నడుపుతున్నారని అదే గ్రామానికి చెందిన ఎస్.డాక్టర్‌బాబు, పల్లి ఏడుకొండలు, కొత్తపేట ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో విచారణాధికారిగా ఎంఎస్వో టి.శ్రీనివాస్‌ను నియమించారు. విచారణలో ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగుచూశాయి. డీలర్ మత్రి శ్రీకళ గ్రామంలో ఉండటంలేదని ఆమె వేలిముద్రను క్లోనింగ్ చేసి బినామీ నిర్వహిస్తున్నారని తెలపడంతో పాటు బియ్యం పంపిణీలో తేడాలు ఉండటంతో సంబంధిత షాపుపై 6ఏ కేసు నమోదు చేశారు. ఎంఎస్వో టి.శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు షాపు నిర్వహిస్తున్న డీలర్‌తో పాటు షాపు నిర్వహిస్తున్న వారు, వారికి సహకరించిన సంబంధిత సిబ్బంది మత్రి శ్రీకళ, ఇసుకపట్ల సునీల్, నక్కా రాజేంద్ర, మత్రి రాంబాబు, రాపాక కౌశిక్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

డిసెంబరు 26 నుంచి సీపీఐ శత వసంతాల వేడుకలు

అమలాపురం టౌన్, జూలై 27: డిసెంబరు 26 నుంచి ఏడాది పాటు సీపీఐ శత వసంతాల వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ తెలిపారు. సీపీఐ ఆవిర్భావ దినోత్సవం నుంచి 2025 డిసెంబరు 26 వరకు వాడవాడలా వేడుకలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లాస్థాయి జనరల్‌బాడీ సమావేశాన్ని మోకా శ్రీనివాసరావు ప్రారంభించగా కె.సత్తిబాబు అధ్యక్షతన శనివారం అమలాపురంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్, జిల్లాలో చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటు, వర్షాలవల్ల, వరదలవల్ల నష్టపోయిన రైతులు, కార్మికులను ఆదుకునేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యవర్గ సభ్యుడు కేశవశెట్టి, దేవ రాజేంద్రప్రసాద్, కె.రామకృష్ణ, రాము పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేసిన కలెక్టర్

రాజోలు, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద బాధితులకు ఒక్కోకుటుంబానికి 25 కిలోల బియ్యం, లీటరు వంటనూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, కందిపప్పు, బంగాళాదుంపలు అందజేశామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాజోలులో నున్నవారిబాడవ ఏటిగట్టు, మేకపాలెం, పల్లిపాలెం ప్రాంతాల ను శనివారం పరిశీలించారు. వరద బాధితులతో ఆయన మాట్లాడారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ జి.భీమారావు, సర్పంచ్ రేవు జ్యోతి, ఇల్లింగి వెంకటరమణ, సెక్రటరీ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో అందరూ పాల్గొనాలి: ఎమ్మెల్యే దేవ

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక వరద ముంపు ప్రాంతాల్లో పడవపై రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శనివారం పర్యటించారు. ఓఎన్జీసీ కాలనీ, బాడిరేవు, కొత్తలంక తదితర వరద ముంపు ప్రాంతాల్లో బాధితులతో మాట్లాడి తాగునీరు, ఆహారం సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రభుత్వం అందించిన సరుకులను పంపిణీ చేశారు. గుండుబోగుల పెదకాపు, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, రావూరి నాగు, మాజీ సర్పంచ్ బర్రే శ్రీను ఏపీవో నాగప్రసాద్, ఏవో నరసింహారావు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, పినిశెట్టి బుజ్జి, గ్రామ వీఆర్వోలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మలికిపురం: రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రామరాజులంక, దిండి గ్రామాల్లో వరద ప్రాంతాలను శనివారం పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. రామరాజులంక బాడవలోకి మోటారుసైకిల్‌పై వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. బాడవ రోడ్డు నిర్మించాలని ఎంపీపీ ఎంవీ సత్యవాణి కోరారు. రామరాజులంక, దిండి గ్రామాల్లో వరద బాధితులకు బియ్యం అందజేశారు.

వరద బాధితులకు ఆహారం అందించాలి: గొల్లపల్లి

అంతర్వేది: అప్పనరామునిలంక, సఖినేటిపల్లిపల్లిపాలెం, టేకిశెట్టిపాలెం, లాకపేట తదితర వరద ముంపు ప్రాంతాల్లో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు పడవపై ప్రయాణించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను రక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని, వారికి ఇవ్వాల్సిన సాయం తక్షణమే ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, ఈద రవిరెడ్డి, నల్లి ప్రేమానందం, నల్లి మోహన్, జిల్లెళ్ల చిట్టి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

పి.గన్నవరం: గోదావరి వరద ప్రభావిత గ్రామాలైన గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు గ్రామాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బియ్యాన్ని వరద బాధితులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరదబాధితులను ప్రభుత్వ పరంగా అన్నివిధాల ఆదకుం టామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, తహసీల్దార్ ఎస్‌కె హరాస్సెన్, ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాని, ఎంపీటీసీ పల్లిమోసే, సర్పంచ్ దంగేటి అన్నవరం, తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, బొరుసు సుబ్బరాజు పాల్గొన్నారు.

మామిడికుదురు: వరద బాధితులకు ప్రభుత్వం అందించే బియ్యాన్ని పాశర్లపూడిలో టీడీపీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. ప్రభుత్వం బాధితులను అన్నివిధాలా ఆదుకుంటుందని టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, టీడీపీ నాయకులు మద్దాల కృష్ణమూర్తి, బోనం బాబు, సూదా బాబ్జి, చుట్టుగుళ్ల కిశోర్, మల్లాడి విష్ణు, గంధం బాస్కర్, జనసేన నాయకులు జాలెం శ్రీనివాసరాజా, తుండూరి బుజ్జి పాల్గొన్నారు.

బోడసకుర్రులో..

అల్లవరం: వైనతేయ వరద కారణంగా బోడసకుర్రు పల్లిపాలెంలో ముంపు బారిన పడిన కుటుంబాలకు 25 కేజీల వంతున తహసీల్దారు పి.సునీల్‌కుమార్, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి శనివారం బియ్యం పంపిణీ చేశారు. ముంపునకు గురైన కుటుంబాలతో పాటు జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.దుర్గాశ్రీనివాస్, చింతా బాబ్జి, ఓలేటి పరమేశ్వరరావు, రొక్కాల నాగేశ్వరరావు, ఆర్ఐ ఎండీ శ్రీనివాస్, వీఆర్వోలు యు.చిట్టిబాబు, సత్యనారాయణ, ఉల్లీష్, వీర్రాజు, కేవీ రెడ్డి పాల్గొన్నారు.

ముంపు పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

అల్లవరం, జూలై 27: అధిక వర్షాల కారణంగా ముంపునకు గురైన అల్లవరం, రెల్లుగడ్డ గ్రామాల్లో వరి పొలాలను జిల్లా వ్యవసాయధికారి బోసుబాబు బృందం శనివారం పరిశీలించింది. ముంపు దిగిన పొలాల్లో ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చల్లాలని సూచించారు. రామేశ్వరం మొగ వద్ద ఇసుక మేటలు తొలగించనందున అన్ని మురుగు కాలువల నుంచి ముంపు నీరు దిగుతోందని బోసుబాబు చెప్పారు. మండలంలో 950 ఎకరాలలో వరినాట్లు పూర్తయ్యాయని 250 ఎకరాల్లో వరినారుమడులు, 20 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఏడీఏ ఎంప షంసి, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, కొనుకు బాపూజీ, ఎంపీటీసీ ఎన్.మౌనిక వరలక్ష్మి, ఎన్.సుబ్బరాజు, పచ్చిమాల ఏడుకొండలు, కుడుపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు ఘన నివాళి

పి.గన్నవరం, జూలై 27: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని అబ్దుల్‌కలాం ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా దత్తత ఆసుపత్రి సీహెచ్‌సీలో ఎముకల విభాగం డాక్టర్ రాఘవేంద్రరావు, సర్పంచ్ బొండాడ నాగమణిలు అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, సభ్యులు గూటం శ్రీనివాసరావు, మామిళ్ళపల్లి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట: భారతదేశం గర్వించదగ్గ మహామనిషి, అనుశాస్త్ర పితామహుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అలాగే విద్యాబాలమందిర్‌లో కరస్పాండెంట్ ఆర్.అనురాధ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శివరత్నం, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి ఆలయ మార్గం బోర్డులు ఏర్పాటు

అంతర్వేది, జూలై 27: సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామం పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రహదారి మార్గాల వెంబడి మార్గాన్న సూచించే బోర్డులను ఏర్పాటు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. స్వామివారి చిత్రపటంతో ఏర్పాటుచేసిన ఈ బోర్డులపై అపరిచిత వ్యక్తులు ఎటువంటి బోర్డులు ఏర్పాటు చేయరాదన్నారు.

నీతి అయోగ్‌కు హాజరుకాని సీఎం

యానాం, జూలై 27: ప్రధాని మోదీ నేతృత్వంలో ఢిల్లీలో జరిగే నీతిఅయోగ్ సమావేశానికి పుదుచ్చేరి సీఎం ఎన్.రంగస్వామి హాజరుకాకపోవడం రాజకీయవర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది. గతంలో ఈ సమావేశాలకు పుదుచ్చేరి సీఎం హాజరుకావాల్సి ఉన్నప్పటికీ ప్రజాపనులశాఖ మంత్రిని పుదుచ్చేరి నుంచి పంపే వారు. ఈసమావేశంలో సీఎం తప్పనిసరిగా హాజరు కావాలని కేంద్రం కోరింది. దీంతో ఢిల్లీ పయనమైన సీఎం చివరి నిమిషంలో ప్రయాణం రద్దు చేసుకున్నారు.

'రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ మార్చాలి'

మలికిపురం, జూలై 27: గుడిమెళ్లంకలో 14 ఎకరాల విస్తీర్ణంలో గల పంచాయతీ చెరువు మీదుగా రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ లేకుండా చూడాలని గుడిమెళ్లంకలో జరిగిన సమావేశంలో పలువురు పేర్కొన్నారు. పంచాయతీ చెరువు నాలుగు గ్రామాలకు మంచినీటి చెరువుగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తాగునీటి సౌకర్యంకోసం చేసే ప్రయత్నానికి ఈ చెరువు ఉపయోగపడుతుందన్నారు. మంచినీటి చెరువుకు, గ్రామ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్, ఆర్డీవో, ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించాలని సమావేశం తీర్మానించింది.

విద్యార్థి నిజాయితీ

ముమ్మిడివరం, జూలై 27: మండలంలోని గున్నేపల్లి నల్లావారిపేటలో ఐదో తరగతి విద్యార్థి సూదా రోహిత్ శనివారం పాఠశాలకు వెళుతుండగా రూ.600 నగదు దొరికింది. ఆ నగదును పాఠశాల హెచ్ఎం కె.మాణిక్యాంబకు అందజేశాడు. ఆ సొమ్మును పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశారు. గ్రామస్తులు ఆ విద్యార్థిని అభినందించారు.

ద్వారపూడి పంచాయతీలో నిధుల దుర్వినియోగం

- ఎమ్మెల్యే వేగుళ్ల ఫి ర్యాదు మేరకు డీపీవో విచారణ

మండపేట, జూలై 27, మండపేట మండలం ద్వా రపూడి పంచాయతీలో లబ్ధిదారులు, విరాళాలతో నిర్మిం చిన 40 దుకాణాల సముదాయంలో నిధులు దుర్వినియోగం జరిగాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలపై జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు శనివారం పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వ హించారు. పంచాయతీలో నిర్మించిన దుకాణ సముదా యానికి ప్రభుత్వ అనుమతి ఉందా? అసలు నిదు లెక్కడివి ఏ నిధులతో దుకాణాలు నిర్మించారు. ఎపుడు నిర్మాణం చేపట్టారు. ఎంబుక్ నమోదైందా? టెక్నికల్ అనుమతులు తీసుకున్నారా, ఎవరి ఆధ్వర్యంలో పనులు జరిగాయి అనే అంశాలపై ఆరా తీశారు. లబ్ధిదారుల నుంచి ఎంతమేర నిధులు వసూలు చేశారు. ఆ నిధులు ఏ ఖాతాలో జమచేశారు. ఎంతమేరకు వినియోగం చేశారు అనే అంశాలను డీపీవో రాంబాబు ఆరా తీశా రు. కేవలం పంచాయతీ 2022లో బైలా తీర్మానం ద్వా రా మాత్రమే గ్రామంలో పంచాయతీ పాలకవర్గంలో సభ్యులు, ప్రముఖులను కమిటీగా ఏర్పాటు చేసి నిర్మాణ పనులు చేపట్టామని డీపీవో ముందు అప్పటిలో కార్యదర్శులుగా పనిచేసి సుబ్బారావు, వెంకటరత్నంలు చెప్పారు. దుకాణ సముదాయం నిధులు వ్యవహారంపై కమిటీలో కీలకపాత్ర వహించి నిర్మాణపనులు చేసిన ఉపసర్పంచ్ తూల శేషారావు, కమిటీ సభ్యుడు వర్మలు హాజరై దుకాణ సముదాయం నిర్మాణం గురించి డీపీవోకు వివరించారు. దుకాణాల కోసం 31మంది నుంచి రూ.6లక్షలు వంతున పంచాయతీ పాలకవర్గం వసూలు చేసింది. అందులో 4.5లక్షలు దుకాణం నిర్మాణంకోసం మరో లక్షన్నర పంచాయతీ వద్ద డిపా జిట్ కట్టాలని తీర్మానించారు. వీటి నిర్మాణ బాధ్యతలు అన్నీ కూడా అధికార పార్టీకి చెందిన పాలకవర్గంలో ఒకరు తీసుకుని అన్నీ తానై వ్యవహరించారు. మొత్తం 40 దుకాణాలు నిర్మించినప్పటికీ అందులో 9మందికి దుకాణాలు గ్రామంలో ఫ్లైఓవర్ వంతెన నిర్మించిన సమయంలో దుకాణాలు కోల్పోయిన వారికి కేవలం రూ.4.5లక్షలు చెల్లించగా అందులో మిగిలిన 9మందికి డిపాజిట్ లేకుండానే కేవలం రూ.4.5లక్షలు చెల్లించేట్టుగా తీర్మానించారు. మిగిలిన 31 మంది వ్యాపారుల నుంచి రూ.6లక్షల వంతున వసూలు చేయగా అందులో రూ.1.50లక్షలను పంచాయతీకి డిపాజిట్‌గా రూ.45 లక్షలు చెల్లించేలా తీర్మానించారు. డిపాజిట్ రూపేణా పంచాయతీకి కేవలం రూ. 23లక్షలు వసూలైంది. మరో రూ. 22లక్షలు మేర వసూలు కావల్సి ఉంది. ఆ నిధులు ఏ మేరకు వసూలు అయ్యాయి. వసూలైన నిధులు ఎక్కడ ఉన్నాయి. డిపాజిట్లు ఎంత వచ్చాయి. వాటిని ఎక్కడ జమచేశారనే అంశాలను డీపీవో ఆరా తీశారు. డీపీవో విచారణ సమయంలో కమిటీ సభ్యులు చాలామంది హాజరుకాలేదు. కేవలం ఇద్దరు మాత్రమే సభ్యులు హాజరయ్యారు. ప్రభుత్వ పరిపాలన అను మతులు లేకుండా కేవలం పంచాయతీ పాలకవర్గం తీర్మానం ద్వారా 40దుకాణాల సముదాయం రూ.1.75 కోట్లతో చేపట్టే పనులు మండల ఇంజనీ రింగ్ అధికారి లేకుండా ఎంబుక్ రికార్డు లేకుండా, గుడా అనుమతు లు లేకుండా ఎటు వంటి టెక్నికల్ నాలెడ్జి లేకుండా పాలకవర్గంలో కీలకవ్యక్తి దుకాణాల సముదాయం నిర్మించటం అవికూడా నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మించటంపై కూడా పలు అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. బస్‌షెల్టర్ ముసుగులో మరో నాలుగు దుకాణాలు అదనంగా నిర్మించి అందులో వ్యాపారుల వద్ద నుంచి నలుగురి వద్ద రూ.50వేలు వంతున డిపాజిట్ కట్టించు కున్నట్లు వెల్లడైంది. ఇక్కడ కూడా భారీగా నగదు చేతులు మారాయని తెలుస్తోంది. విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్‌కు వివరించి త్వరలోనే బహిరంగ విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుం టామని డీపీవో శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. విచారణకు మండపేట మండల ఇన్‌చార్జీ ఈవోపీఆర్‌డి ఐదంరాజు, గతంలో ఇక్కడ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన పంచా యతీ కార్యదర్శులు సుబ్బారావు, వెంకటరత్నంలతోపాటు ద్వారపూడి పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణ ఉపసర్పంచ్ తులాశేషారావు, వర్మ ఉన్నారు.

పొన్నమండ సర్పంచ్ అరెస్టు

రాజోలు, జూలై 27: పొన్నమండ సర్పంచ్ కె.బేబికుమారిని అరెస్టుచేసి రాజోలు కోర్టులో హాజరుపరుచగా జడ్జి 14 రోజులు రిమాండు విధించారని రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సర్పంచ్ బేబికుమారి కుమారుడు స్టాలిన్ తనను మోసం చేశాడని ఒక యువతి రాజోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సర్పంచ్ కుమారుడు పరారీలో ఉన్నాడని, అతని తల్లి బేబీకుమారిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఆయన పేర్కొన్నారు.

యానాం మద్యంతో వ్యక్తి అరెస్టు

ద్రాక్షారామ, జూలై 27: ద్రాక్షారామ సంతమార్కెట్‌లో శుక్రవారం యానాం మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తొట్టా వీరభద్రరావు అనే వ్యక్తి యానాం నుంచి మద్యం తీసుకుని వచ్చి విక్రయిస్తుండగా పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 37 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ. 3676 ఉంటుందని ఎస్ఐ తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాత్రి ఎస్ఐ కేసు నమోదు చేశారు.

'నాఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోళ్లు'

అంబాజీపేట, జూలై 27: తీవ్ర సంక్షోభంలో ఉన్న కొబ్బరి రైతులను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్రాలు ఆయిల్ ఫెడ్, నాఫెడ్ ద్వారా ఏర్పాటుచేసే నాఫెడ్ కేంద్రాలద్వారా రాష్ట్రవ్యాప్తంగా 8వేల క్వింటాళ్ల కొబ్బరి కొనుగోళ్లు లక్ష్యమని ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ యు.సుధాకరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమలో అంబాజీపేటలో ఈనెల 8వ తేదీన నాఫెడ్ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఆగస్టు మొదటి వారంలో కోనసీమలోని ముమ్మిడివరం, కొత్తపేటలలో ఈ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రైతులు ఎన్ని ఎకరాలు ఉన్న ఒకేసారి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఎకరాకు రెండు బస్తాలు చొప్పున రైతు పేరున ఎన్ని ఎకరాలు ఉన్న ఒకేసారి రిజిస్ట్రేషన్ అవుతుందన్నారు. ధ్రువీకరణ పత్రాలను 6 నెలలకు పొందాలన్నారు. ఆగస్టు మొదటి వారంలో అంబాజీపేటలో కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. మిల్లింగ్ కోప్రాకు క్వింటాళ్ళకు రూ.11,160, బాల్‌కోప్రాకు రూ.12వేలు మద్దతు ధర నిర్ణయించామన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు గడువు పెంచాలి

అమలాపురం రూరల్, జూలై 27: జిల్లాలో వరదలు, వర్షాల కారణంగా జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరో పదిరోజులు పొడిగించాలని మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను కలిసి శనివారం ఎంపీటీసీలు మోటూరి కనకదుర్గ-వెంకటేశ్వరరావు, కోరుమిల్లి శ్రీరామచంద్రమూర్తి వినతిపత్రం అందజేశారు. ఈ అంశంపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.